త్వరలో రైతు, విద్యా కమిషన్లు

- కౌలు రైతుల సమస్యలపై అఖిల పక్షం
- రైతు భరోసా లబ్ధిదారులపై విస్తృత చర్చ జరగాలి
- పంటల బీమాను అమలు చేస్తాం
- నియోజకవర్గాల్లో సంక్షేమ గురుకుల ప్రాంగణాలు ఏర్పాటు
- పౌర సమాజ ప్రతినిధులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

పౌర సమాజ ప్రతినిధులతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

"త్వరలో రైతు, విద్యా కమిషన్లను ఏర్పాటు చేస్తాం. రాష్ట్రంలో విద్యా విధానం ఎలా ఉండాలో ఎడ్యుకేషన్ కమిషన్ నిర్ణయిస్తుంది. రైతులు, కౌలు రైతుల సాధక బాధకాలు, సంక్షేమం, వ్యవసాయ రంగంలో సంస్కరణలకు సంబంధించి రైతు కమిషన్ తగిన సలహాలు సూచనలు అందిస్తుంది." అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఎమ్మెల్సీ మహేష్‌గౌడ్‌తో కలిసి యోగేంద్ర యాదవ్, గాదె ఇన్నయ్య, ప్రొఫెసర్లు కోదండరాం, హరగోపాల్, విశ్వేశ్వర్‌రావు, రమ మేల్కొటే, రియాజ్, పురుషోత్తం తదితర పౌర సమాజ ప్రతినిధులతో సిఎం ఇష్టాగోష్టిగా ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన రోజు నుంచే తమ ప్రభుత్వం ప్రజాహిత కార్యక్రమాలను చేపట్టిందని చెప్పారు. ఇందిరా పార్కు వద్ద ధర్నా చౌక్‌ను తెరిచామనీ, ప్రజా భవన్‌ను ప్రజలు తమ సమస్యలు చెప్పుకునేందుకు అనువుగా అందుబాటులోకి తెచ్చామని గుర్తు చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాల అమలుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. వాస్తవాలు ప్రజలకు తెలియాలనీ, ఆర్థిక, విద్యుత్, సాగునీటి రంగాల స్థితిగతులపై పూర్తి వివరాలతో అసెంబ్లీలో శ్వేతపత్రం విడుదల చేశామని చెప్పారు. మహిళలు, నిరుపేద కుటుంబాలకు లబ్ధి చేకూర్చేలా ఇప్పటికే నాలుగు గ్యారంటీలను అమలు చేశామని అన్నారు. కౌలు రైతుల రక్షణకు సంబంధించి త్వరలో అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తామని చెప్పారు. అందరి సూచనలు, సలహాల ఆధారంగా కౌలు రైతుల రక్షణ చట్టంపై నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. పంటలకు పెట్టుబడి సాయంగా అందించే రైతు భరోసా సాయాన్ని ఎవరికివ్వాలనే దానిపై విస్తృత చర్చ జరగాలని సిఎం చెప్పారు. నిస్సహాయులకు, నిజమైన లబ్ధిదారులకు అవసరమైతే చెప్పిన దానికంటే ఎక్కువ సాయం చేయాలనేది ప్రభుత్వ ఆలోచనగా ఉందన్నారు. పంటల బీమా పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తామని ఆయన ఈ సందర్భంగా ప్రకటించారు. రాష్ట్రంలో పంట మార్పిడి పథకాలకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరముందనీ, అన్ని పంటలు విస్తరించేలా సరికొత్త విధానాలను అనుసరించాలని రైతులకు సూచించారు. రాష్ట్రంలో పాఠశాలలు, విద్యాలయాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నదని వారికి వివరించారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనారిటీ గురుకులాలను వేర్వేరు చోట్ల కాకుండా, ఒకే ఇంటిగ్రేటేడ్ క్యాంపస్‌లో ఏర్పాటు చేస్తామని చెప్పారు. పైలట్ ప్రాజెక్టుగా కొడంగల్‌లో అలాంటి క్యాంపస్ నెలకొల్పుతామని అన్నారు. దశల వారీగా అన్ని నియోజకవర్గాలకు ఆయా క్యాంపస్‌లను విస్తరిస్తామని స్పష్టం చేశారు. ఈ విధానం వల్ల విద్యా సంస్థల్లో కుల, మత వివక్ష తొలిగిపోవడంతో పాటు, విద్యార్థుల్లో ప్రతిభా పాటవాలు, పోటీ తత్వం పెరుగుతదని అన్నారు. తద్వారా గురుకులాల నిర్వహణ, పర్యవేక్షణ, అజమాయిషీ మరింత సమర్థంగా జరుగుతుందని సీఎం అభిప్రాయపడ్డారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించేందుకు తమ ప్రభుత్వం నిబద్ధతతో పని చేస్తుందనీ, ఎవరికీ అనుమానాలు అక్కర్లేదని భరోసా ఇచ్చారు. గత ప్రభుత్వంలో ఉన్న చిక్కుముడులు తొలగించి ఉద్యోగాలను భర్తీ చేసినట్టు గుర్తు చేశారు. గ్రూప్ 1, మెగా డిఎస్‌సి నోటిఫికేషన్లు ఇప్పటికే విడుదలయ్యాయని చెప్పారు. యుపిఎస్‌సి తరహాలో టిఎస్‌పిఎస్‌సి ద్వారా నియామకాలు చేపడతామన్నారు. రాష్ట్రంలోని అన్ని వర్గాలకు న్యాయం చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమనీ, అందు కోసం అందరి సలహాలు, సూచనలతో ముందుకు పోతామని చెప్పారు.

మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

కెటిఆర్ దమ్ముంటే
నిజామాబాద్ ఎంపిగా పోటీ చెయ్..

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కెటిఆర్‌కు దమ్ముంటే నిజామాబాద్ నుంచి ఎంపిగా పోటీ చేయాలని కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సవాల్ విసిరారు. జగిత్యాల జిల్లాలోని ఇందిరా భవన్‌లో శుక్రవారం మీడియాతో ఎమ్మెల్సీ మాట్లాడారు. అధికారం కోల్పోయినా కెటిఆర్‌కు ఇంకా జ్ఞానోదయం కావడంలేదన్నారు. ఎమ్మెల్యేగా ఉన్న కెటిఆర్ తన స్థాయి మరిచిపోయి సిఎం రేవంత్ రాజీనామా చేసి మళ్లీ పోటీకి రావాలంటూ సవాలు విసరడం హాస్యాస్పదం అన్నారు. ఎమ్మెల్యే పదవి, సిఎం పదవి ఒక్కటేనా అని నిలదీశారు. కెటిఆర్‌కు రేవంత్‌కు నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉందన్నారు. మొన్నటి వరకు బిఆర్ఎస్ మెదక్ ఎంపి సీటు అయినా గెలుస్తుందేమో అని అనిపించేదని. ఇప్పుడు కెటిఆర్ వైఖరితో మెదక్ కూడా గెలిచే పరిస్థితి లేదన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీకి ఓటేస్తే పెన్షన్ రాదని అసత్య ప్రచారం చేశారని, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేస్తుందని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టులో రెండు టిఎంసిలు ఉపయోగించకుండా మరో అదనపు టిఎంసి కోసం అనుమతులు లేకుండా చేపట్టడం నేరమని తెలిపారు. తుమ్మిడి హెట్టీ వద్ద ప్రాజెక్టు నిర్మాణం చేపడితే ఒక్క లిఫ్ట్‌తో ఎల్లంపల్లికి నీరు చేరేదని కేంద్ర జలవనరుల శాఖ నిపుణులు వేదిర శ్రీరామ్ నివేదిక ఇచ్చారని గుర్తు చేశారు. మెడిగడ్డ పిల్లర్లు కుంగడం టెక్నికల్ లోపమని, ఇకనైనా బిఆర్ఎస్ పార్టీ నాయకులకు జ్ఞానోదయం కావాలని విమర్శించారు. సమావేశం అనంతరం పలువురు బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్సీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

కాళేశ్వరంపై చర్చకు సిద్ధమా?

- ప్రొఫెసర్ కోదండరాం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రతిష్టాత్మక నిర్మాణంగా బిఆర్ఎస్ సర్కార్ చెప్పుకున్న కాళేశ్వరం ప్రాజెక్టు రాష్ట్రాన్ని సంక్షోభంలోకి నెట్టిందని టిజెఎస్ రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం విమర్శించారు. శుక్రవారం హైదరాబాద్ నాంపల్లిలోని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బిఆర్ఎస్ ప్రభుత్వ ప్రణాళిక, నాణ్యత, డేసైన్, నిర్వహణ లోపం కారణంగా సాగు, ఇంజనీరింగ్, ఆర్థిక సంక్షోభం తలెత్తిందని తెలిపారు. కేవలం ముడు పిల్లర్లకు సంబంధించిన సమస్యగా బిఆర్ఎస్ నమ్మించే ప్రయత్నం చేస్తున్నదని, కానీ ఆ ప్రాజెక్టుకు తలకాయ వంటి మేడిగడ్డ దెబ్బతినడమంటే ఆ ప్రాజెక్టు ప్రయోజనమే ప్రశ్నార్థకంగా మారిందన్నారు. 18 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు ఉద్దేశించిన ప్రాజెక్టుకు సంబంధించి బిఆర్ఎస్ ప్రభుత్వం సిడబ్ల్యుసి హెచ్చరికలను బేఖాతరు చేసి, ఒక ఎకరానికి నీళ్లించేందుకు రూ.46 వేల కోట్లు ఖర్చయ్యేలా చేసిందని తెలిపారు. రాష్ట్రం ఉత్పత్తి చేసే విద్యుత్ లో 60 శాతం ఒక్క కాళేశ్వరానికే ఖర్చు చేయాల్సి వస్తుందన్నారు. మిలియన్ మార్చ్ దినోత్సవం మార్చి 10న నీళ్ల - నిధులపై టిజెఎస్ ఓపెన్ డిబేట్ నిర్వహిస్తున్నదని, చర్చకు రావాలని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌కు సవాల్ విసిరారు. ఈ సమావేశంలో పార్టీ ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ పిఎల్ విశ్వేశ్వర్ రావు, ప్రధాన కార్యదర్శి బైరి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన వాహన అమ్మకాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రస్తుత ఏడాది ఫిబ్రవరిలో వాహన పరిశ్రమ సానుకూల గణాంకాలను నమోదు చేసింది. అనేక కంపెనీలు అమ్మకాల వృద్ధిని సాధించాయి. దిగ్గజ మారుతి సుజుకి విక్రయాలు 15 శాతం పెరగ్గా.. హోండా కార్స్ ఎగుమతులు ఏకంగా 510 శాతం ఎగిశాయి. ఎంజి మోటార్ అమ్మకాల్లో విద్యుత్ వాహనాల వాటా 30 శాతానికి చేరింది. టాటా మోటార్స్ వాణిజ్య వాహన అమ్మకాల్లో తగ్గుదల చోటు చేసుకున్నప్పటికీ.. స్థూల అమ్మకాల్లో పెరుగుదలను నమోదు చేసింది.

మారుతి సుజుకి అమ్మకాల్లో 15 శాతం వృద్ధి

దేశంలోనే అతిపెద్ద కార్ల తయారీ కంపెనీ మారుతి సుజుకి 2024 ఫిబ్రవరి అమ్మకాల్లో 15 శాతం వృద్ధితో 1.97 లక్షల యూనిట్లను డెలివరీ చేసింది. దేశీయంగా 9 శాతం పెరుగుదలతో 1.69 లక్షల యూనిట్ల అమ్మకాలు చేసినట్లు ప్రకటించింది. ఎగుమతులు 68 శాతం ఎగిసి 28,927 యూనిట్లుగా చోటు చేసుకున్నాయి..

టాటా మోటార్స్ వాణిజ్య వాహనాలు..

గడిచిన ఫిబ్రవరిలో టాటా మోటార్స్ 9 శాతం వృద్ధితో 84,834 యూనిట్ల వాహనాల అమ్మకాలు చేసింది. ప్యాసింజర్ వాహన విక్రయాలు 19 శాతం పెరిగి 51,321 యూనిట్లుగా, విద్యుత్ వాహనాలు 30 శాతం ఎగిసి 6,923 యూనిట్లుగా నమోదయ్యాయి. కాగా మొత్తం వాణిజ్య వాహన అమ్మకాల్లో మాత్రం 4 శాతం తగ్గి 35,085 యూనిట్లుగా చోటు చేసుకున్నాయి.

హ్యుందాయ్ ఎగుమతుల్లో తగ్గుదల

హ్యుందాయ్ మోటార్ ఇండియా 2024 డిసెంబర్‌లో 4.5 శాతం పెరుగుదలతో 60,501 యూనిట్లను విక్రయించింది. 2023 ఇదే నెలలో 57,851 యూనిట్ల అమ్మకాలు చేసింది. గడిచిన నెలలో ఎగుమతులు 5 శాతం తగ్గి 10,300 యూనిట్లుగా నమోదయ్యాయి.

పెరిగిన టొయోటా అమ్మకాలు..

టియోటా కిర్లోస్కర్ మోటార్ (టికెఎం) ఈ ఏడాది ఫిబ్రవరిలో 61 శాతం వృద్ధితో 25,200 యూనిట్ల అమ్మకాలు చేసింది. 2023 ఇదే నెలలో 15,685 యూనిట్ల అమ్మకాలను నమోదు చేసింది. గడిచిన నెలలో దేశీయంగా 23,300 యూనిట్లు, ఎగుమతుల ద్వారా 1,920 యూనిట్లను సరఫరా చేసింది.

రాణించిన ఎంజి మోటార్..

ఎంజి మోటార్ ఇండియా 2024 ఫిబ్రవరిలో 8 శాతం వృద్ధితో 4,532 యూనిట్ల అమ్మకాలు చేసింది. 2023 ఇదే నెలలో 4,193 యూనిట్ల అమ్మకాలు చేసింది. గత నెలలో విద్యుత్ వాహనాల అమ్మకాలు 33 శాతం వాటాను కలిగి ఉన్నాయని ఆ సంస్థ తెలిపింది.

దుమ్మురేపిన హోండా కార్లు..

హోండా కార్స్ ఇండియా (హెచ్‌సిఐఎల్) గడిచిన ఫిబ్రవరి మాసం ఎగుమతుల్లో 510 శాతం వృద్ధితో 5,936 యూనిట్లను సరఫరా చేసినట్లు ప్రకటించింది. దేశీయంగా 17 శాతం పెరుగుదలో 7,142 యూనిట్లను అమ్మకాలు చేసినట్లు పేర్కొంది.

బిఆర్ఎస్ పాపాల్లో బిజెపికి పాత్ర

- మంత్రి ఉత్తమ్ విమర్శ
- అలయ్‌బలయ్‌తోనే లక్ష కోట్ల రుణం
- ఎల్అండ్‌టికి రూ.400 కోట్లు ఆపాం
- బాధ్యులపై క్రిమినల్ చర్యలు
- ఆ రుణాలన్నీ కెసిఆర్, కెటిఆర్ కట్టాల్సిందేనని వ్యాఖ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్ సర్కారు పాపాల్లో బిజెపికీ పాత్ర ఉందని రాష్ట్ర సాగునీటి, ఆయకట్టు, అభివృద్ధి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం సచివాలయంలో ఎమ్మెల్యే బి లక్ష్మిరెడ్డితో కలిసి మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. ఆ రెండు పార్టీల మధ్య అలయ్ బలయ్ ఉందని, అందుకే రూ. లక్ష కోట్ల రుణం వచ్చిందని గుర్తు చేశారు. మేడిగడ్డ నిర్మాణలోపం నేపథ్యంలో ఎల్అండ్‌టి కంపెనీకి చెల్లించాల్సిన రూ.400 కోట్ల బిల్లులను ఆపామని ప్రకటించారు. కాళేశ్వరంపై విజిలెన్స్ నివేదిక అందిందనీ, బాధ్యులపె క్రిమినల్ చర్యలు తీసుకుంటామని తెలిపారు. జరిగిన నష్టానికి ఇరిగేషన్‌లో ఉన్న రుణాలను కేసీఆర్, కేటీఆర్‌లే కట్టాలని వ్యాఖ్యానించారు. మేడిగడ్డ వెళ్లిన బీఆర్ఎస్ లీడర్లు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. తుమ్మిడిహెట్టివద్ద నీళ్లు లేవని అసత్య ప్రచారం చేశారనీ, అక్కడ 160 టీఎంసీల మేరనీళ్లున్నట్టు సిడబ్ల్యుసి చెప్పిందని అన్నారు. మేడిగడ్డ.. ఓ బొందల గడ్డ ఏం పీకపోతరు అన్నారని, ఇప్పుడు ఎందుకు వెళుతున్నారని ప్రశ్నించారు. బీఆర్ఎస్ లీడర్లు కమీషన్లకు కక్కుర్తిపడి తెలంగాణ ప్రజలు, రైతుల భవిష్యత్‌ను పణంగా పెట్టారని అన్నారు. మేడిగడ్డ విచారణకోసం ఎన్డీఎస్ఏ కమిటీ వేయడాన్ని తాము స్వాగతిస్తున్నామని తెలిపారు. ఎన్‌డిఎస్ఎ ఏ సమాచారం అడిగినా ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. తాను శనివారం ఢిల్లీ వెళుతున్నానీ, మేడిగడ్డ అంశంపై పలువురు నిపుణులు, అధికారులను కలుస్తానని మంత్రి చెప్పారు. నిపుణులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని వివరించారు. ప్రాణహిత-చేవెళ్లను పూర్తిచేస్తే కాంగ్రెస్‌కు క్రెడిట్ వస్తుందనే కుట్రతోనే కేసీఆర్ రీడిజైన్ చేశారని వ్యాఖ్యానించారు. ప్రాజెక్టుల విషయంలో గత ప్రభుత్వానివి భారీ తప్పులని చెప్పారు. బిఆర్ఎస్ తీరు హాస్యాస్పదమని చెప్పారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డిఎస్ఎ) కమిటీ ఏర్పాటును స్వాగతిస్తున్నట్టు తెలిపారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లపై సత్వర విచారణ జరగాలనీ, ప్రాజెక్టుల విషయంలో గత ప్రభుత్వం భారీతప్పులు చేసిందని విమర్శించారు. జియాలాజికల్ సర్వే చేయలేదనీ, అందుకే ఆ సమాచారాన్ని ఎన్‌డిఎస్ఏకు పంపలేదన్నారు. గత ప్రభుత్వం పనితీరు సరిగ్గా లేకపోవడం వల్లే ప్రాజెక్టుల్లో భారీ అవినీతి, తప్పులు జరిగాయని చెప్పారు. విజిలెన్స్ నివేదికపై న్యాయసలహా తీసుకుని కేసులు పెడతామని ప్రకటించారు. అక్రమార్కులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కేసీఆర్ ఇప్పటివరకు మేడిగడ్డ ఘటనపై మాట్లాడలేదని చెప్పారు. రాష్ట్రానికి రూ.లక్ష కోట్లు నష్టం చేశారని విమర్శించారు. ప్రాజెక్టు పూర్తయినట్టు కంప్లీషన్ సర్టిఫికెట్ ఇవ్వడాన్ని తప్పుబట్టారు. ప్లానింగ్, డిజైన్. నిర్వహణలో బిఆర్ఎస్ ప్రభుత్వ అసమర్థత కనిపించిందన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వానిది చిల్లర ప్రచారం

- మేడిగడ్డలో చిన్న సమస్యను భూతద్దంలో చూపిస్తున్నారు
- వరద వచ్చేనాటికి బ్యారేజీని పునరుద్ధరించాలి : కెటిఆర్
- ప్రాజెక్టును పరిశీలించిన బిఆర్ఎస్ నేతల బృందం
- బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సూచన

విలేకరులతో మాట్లాడుతున్న కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"కాంగ్రెస్ ప్రభుత్వం చిల్లర ప్రచారం చేస్తోంది.. రాష్ట్రం, రైతులపై పగ పెట్టుకోవడం సరికాదు.. రాజకీయంగా తమపై కోపం ఉంటే తీర్చుకోండి.. కానీ రైతులకు మాత్రం న్యాయం చేయాలి.. వర్షా కాలం వరద వచ్చేనాటికి మేడిగడ్డ బ్యారేజీని పునరుద్ధరించాలి" అని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కెటిఆర్ అన్నారు. నీళ్ల లేక ఎండిపోతున్న పంటలను కాపాడాలని, 1.6 కిలో మీటర్ విస్తీర్ణంగల బ్యారేజీలో కేవలం 50 మీటర్ల పరిధిలో సమస్య ఉందని, దానిని పరిష్కరించాలని కోరారు. బిఆర్ఎస్ పార్టీ ఇచ్చిన చలో మేడిగడ్డ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మాహదేవ్‌పూర్ మండలం మేడిగడ్డ బ్యారేజీని మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాజ్యసభ సభ్యులు, బిఆర్ఎస్ పార్టీ నేతలతో కలిసి కెటిఆర్ సందర్శించారు. కుంగిన 20వ పిల్లర్ దగ్గరకు చేరుకున్నప్పటికీ క్షుణ్ణంగా పరిశీలించకుండా వెనుతిరిగారు. అన్నారంలో మాజీ మంత్రి స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రాజెక్టుపై పవర్ ప్రజెంటేషన్ చేశారు. ఈ సందర్భంగా కెటిఆర్ విలేకరులతో మాట్లాడుతూ.. వాస్తవాలు తెలియజేసేందుకే చలో మేడిగడ్డ పర్యటనకు వచ్చామన్నారు. మేడిగడ్డ, అన్నారం బరాజ్‌ను సందర్శించామని చెప్పారు. చిన్న సమస్యను భూతద్దంలో పెట్టి కాళేశ్వరం ప్రాజెక్టే కొట్టుకపోయిందని రాష్ట్ర ప్రభుత్వం చిల్లర ప్రచారం చేస్తోందని ఆరోపించారు. సత్వరమే బ్యారేజీ మరమ్మతులు చేపట్టి పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. వచ్చే వానాకాలం లోపల మరమ్మతు చేసి రైతులకు న్యాయం చేయాలన్నారు. నీళ్ల లేక ఇప్పటికే కరీంనగర్ జిల్లాతోపాటు ఇతర జిల్లాల్లో పంటలు ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మేడిగడ్డ బ్యారేజీ విషయంలో బాధ్యులపై చర్యలు తీసుకోండని సూచించారు. అధికారులు, నిపుణులతో కమిటీ వేయాలన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంటే కేవలం మేడిగడ్డ బరాజ్ అన్నట్టు కాంగ్రెస్ నేతలు ప్రచారం చేస్తున్నారన్నారు. మూడు బరాజ్‌లు, 15 రిజర్వాయర్లు, 21 పంపింగ్ స్టేషన్లు, 273 కిలోమీటర్ల టన్నెల్స్, 1500 కిలోమీటర్ల కెనాల్స్ కలిపితే కాళేశ్వరం అని తెలిపారు. మూడు పిల్లర్ల వద్ద సమస్య వస్తే మొత్తం ప్రాజెక్టు వృథా అన్నట్టు మాట్లాడుతున్నారని విమర్శించారు. రాబోయే రోజుల్లో పంటలు ఎండి పోకూడదంటే కామధేనువు లాంటి కాళేశ్వరం ప్రాజెక్టును కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ హయాంలో కట్టిన కడెం, గుండ్లవాగు రెండుసార్లు కొట్టుకుపోయాయని, నాగార్జునసాగర్, శ్రీశైలంలోనూ లీకేజ్‌లు వచ్చాయని.. తాము ఏనాడూ రాజకీయం చేయలేదని చెప్పారు.

మేడిగడ్డను కూల్చేందుకు కుట్ర : హరీశ్‌రావు

రైతును రాజు చేయడమే లక్ష్యంగా నాటి ముఖ్యమంత్రి కెసిఆర్ మేడిగడ్డ ప్రాజెక్టును నిర్మిస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును కూల్చేందుకు కుట్ర పన్నుతోందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఆరోపించారు. అన్నారంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాళేశ్వరంపై రాష్ట్ర ప్రభుత్వం కుట్రలు మానుకుని బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, రైతులతో రాజకీయం చేయరాదని అన్నారు. వర్షాకాలంలో ప్రాజెక్టును దెబ్బతీయాలనే కుట్రతోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నట్టు అర్థమవుతోందన్నారు. నల్లగొండలో కెసిఆర్ మీటింగ్ పెట్టగానే.. కృష్ణా ప్రాజెక్టులను కేంద్రానికి అప్పజెప్పబోమని అసెంబ్లీలో తీర్మానం చేశారని అన్నారు. తాము మేడిగడ్డ అనగానే కాంగ్రెస్ పార్టీ నేతలు పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల యాత్ర చేపట్టారని విమర్శించారు. మెగా ప్రాజెక్టలు కట్టినప్పుడు ఇలాంటి సమస్యలు తలెత్తడం సహజమని, గతంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో కట్టిన కడెం ప్రాజెక్ట్ కొట్టుకపోలేదా అని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వం మొత్తం కాళేశ్వరం ప్రాజెక్టు పనికి రాదని గోబెల్స్ ప్రచారం చేయడం సరికాదన్నారు.

టైర్ బ్లాస్ట్ కలకలం

బీఆర్ఎస్ తలపెట్టిన 'చలో మేడిగడ్డ' టూర్‌లో బస్సు టైర్ బ్లాస్ట్ కావడం కలకలం రేపింది. మేడిగడ్డకు వెళ్తున్న బీఆర్ఎస్ నేతల బస్ టైర్ మార్గ మధ్యలో బ్లాస్ట్ అయింది. ఆ సమయంలో బస్‌లో కొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, మీడియా ప్రతినిధులు ఉన్నట్టు తెలిసింది. ఈ ఘటన జనగామ దగ్గరలో జరిగినట్టు సమాచారం.

In the Court of the Principal Senior Civil Judge at Kakinada
I.A. No. 56/2024 in **O.S. No. 69/2023**

Between:
Matta Ramakrishna ...*Petitioner/ Plaintiff*
AND
Peri Sudha and Another ...*Respondents/Defendants*

To:
1: Peri Sudha, W/o. Balamurali Krishna, aged 54 years, Flat No. 202, Shakila Lahari Apartments, Anand Nagar Colony, Khairatabad, Hyderabad.
2: Peri Balamurali Krishna, S/o. Narasimha Murthy, aged 58 years, Flat No. 202, Shakila Lahari Apartments, Anand Nagar Colony, Khairatabad, Hyderabad.

పై నెంబరు దావాలో 1వ మరియు 2వ ప్రతివాదులు అయిన మీపై దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీ హాజరు నిమిత్తం I.A. No. 56/2024 గా పిటిషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటిషన్లో శ్రీ కోర్టు వారి ద్వారా మీకు ఎన్నిసార్లు నోటీసులు పంపినను మీరు తీసుకొనక ఉద్దేశ్యపూర్వకంగా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది. 19-03-2024వ తేదీకి వాయిదా వేసియున్నారు. కావున మీరు ఆరోజు ఉదయం గం॥ 10.30 ని॥లకు** మీరు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని హాజరయ్యి మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల పై దావా మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
MD.KAREEMUDDIN
Advocate, Rajaji Street
Kakinada, Cell: 7013771662

BEFORE THE HON'BLE 1st ADDL. PRL. JUDGE FAMILY COURT AT BENGALURU
M.C. No. 5225/2023
BETWEEN: Smt. Lakshmi .J. @ Lakshmi .K ... PETITIONER
AND: Sri Pradeep Arukala @ Arukala Pradeep Kumar ... RESPONDENT
NOTICE TO THE RESPONDENT
To, **Sri PRADEEP ARUKALA @ ARUKALA PRADEEP KUMAR**, S/o. Hanumantha Rao, aged about 33 years, Presently R/at No.7-4-53, Venkateshwara Colony, Mahabub Nagar, Andhra Pradesh State-509001.
WHEREAS the petitioner in the above petition has filed the above petition for dissolution of the marriage against the Respondent and the petition filed U/S. 13 (1) (i-a) & (i-b) of Hindu Marriage Act.
You are hereby summoned to appear in person before this Hon'ble 1st Addl. Principal Family Judge at Bengaluru.
Take Notice that in default of your appearance on the day of **30/03/2024** the petition will be heard and determined in your absence.
Given under my hand and seal of this Hon'ble Court on 01/03/2024
By order of the Court, Senior Sheristedar, Family Court, Bengaluru
Advocate For Petitioner
SRI V. RAJANNA & KRISHNA MURTHY .R.C.
Advocate & Legal Consultant
Office at No: 8, 2nd Cross, Mallige Thota, Cholora Palya, Magadi Road, Bengaluru-560023.
Mob: 9343795672

ప్రయివేటు డిగ్రీ కాలేజీ యాజమాన్యాల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ప్రయివేటు డిగ్రీ, పీజీ కాలేజీ యాజమాన్యాల సంఘం నూతన కార్యవర్గం ఎన్నికైంది. శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో నూతన అధ్యక్షులుగా బొజ్జ సూర్యనారాయణరెడ్డి, కార్యనిర్వాహఖ అధ్యక్షులుగా శ్రీధర్‌రావు, పరమేశ్, ఉపాధ్యక్షులుగా నారాయణగౌడ్, రవీంద్రనాథ్, ప్రధాన కార్యదర్శిగా యాద రామకృష్ణ, కోశాధికారిగా శంకర్, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా భాస్కర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో ఆ సంఘం మాజీ అధ్యక్షులు ప్రకాశ్, గింజల రమణారెడ్డి, సుందర్‌రాజు, కార్యదర్శులు హరిస్మరణరెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల పరిధిలోని కార్యవర్గ ప్రతినిధులు హాజరయ్యారు.

పర్యాటకంలో తెలంగాణను అగ్రగామిగా నిలుపుతాం

- గైడ్స్‌కు విదేశీ భాషల్లో ప్రావీణ్యం కోసం ఇఫ్లూ సాయం తీసుకుంటాం
- శిల్పారామంకు పూర్వ వైభవం తీసుకొస్తాం
- పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పర్యాటక రంగంలో తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా నిలపనున్నట్టు పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు జూపల్లి అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (నిథమ్) సంస్థను, మాధాపూర్‌లోని శిల్పారామంను సందర్శించారు. నిథమ్ అకడమిక్ బ్లాక్‌లోని క్లాస్ రూంలు, హాస్పిటాలిటీ బ్లాక్‌లోని కిచెన్, బేకరీ, ట్రైనీ రెస్ట్రారెంట్, మాక్ రూమ్స్, తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులు, బోధన, బోధనేతర ఉద్యోగులు, సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆధునిక ఆర్థిక వ్యవస్థలో పర్యాటక, ఆతిథ్య రంగానికి ప్రాధాన్యం పెరుగుతోందనీ, ఫలితంగా ఈ రంగంలో ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని చెప్పారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మౌలిక వసతుల కల్పన, విద్యార్థులకు ఉపకరణాలు, కొత్త కోర్సులు, తదితర అంశాలపై సమగ్ర నివేదిక సమర్పించాలని ఈ సందర్భంగా అధికారులను మంత్రి ఆదేశించారు. పర్యాటక రంగంలో టూరిస్ట్ గైడ్‌ల పాత్ర కీలకమనీ, అంతర్జాతీయ పర్యాటకులను దృష్టిలో ఉంచుకుని, గైడ్లకు విదేశీ బాషల్లో కోర్సులను నేర్పించాల్సిన అవసరం ఉందన్నారు. దీని కోసం ఇఫ్లూ సాయం తీసుకోనున్నట్టు తెలిపారు. అనంతరం మాదాపూర్ లోని శిల్పారామాన్ని సందర్శించి నిర్వహణ, సౌకర్యాల గురించి ఆరా తీశారు. గత ప్రభుత్వ హయాంలో శిల్పారామాన్ని పట్టించుకోలేదని ఈ సందర్భంగా మంత్రి విమర్శలు గుప్పించారు. ఈ కార్యక్రమంలో నిథమ్ డైరెక్టర్ కె.నిఖిల, టిఎస్‌టిడిసి ఎండి రమేష్ నాయుడు, శిల్పారామం స్పెషల్ ఆఫీసర్ జి కిషన్‌రావు నిథమ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ మిషెల్ జె ఫ్రాన్సిస్ తదితరులు పాల్గొన్నారు.

నిమిషం నిబంధన ఎత్తివేత

- ఐదు నిమిషాల వరకు గ్రేస్ పీరియడ్
- 8.45 గంటలకు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి
- విద్యార్థులకు ఇంటర్ బోర్డు సూచన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలకు అమలు చేస్తున్న నిమిషం నిబంధనను ప్రభుత్వం ఎత్తేసింది. ఉదయం తొమ్మిది గంటల తర్వాత ఆలస్యంగా వచ్చిన విద్యార్థులకు ఐదు నిమిషాల వరకు గ్రేస్ పీరియడ్ ఇస్తున్నట్టు ఇంటర్ బోర్డు ప్రకటించింది. ఈ మేరకు శుక్రవారం ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓజా ఒక ప్రకటన విడుదల చేశారు. అయితే నిర్దిష్ట కారణాల వల్ల ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చిన విద్యార్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారులు, చీఫ్ సూపరింటెండెంట్లు దీన్ని అమలు చేయాలని సూచించారు. నిమిషం నిబంధన వల్ల ఆలస్యమైన ఓ విద్యార్థి ఆదిలాబాద్‌లో ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. అది రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఆ నిబంధన పట్ల విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం, ఇంటర్ బోర్డు అధికారులు ఆ నిర్ణయాన్ని సమీక్షించి విద్యార్థులకు తీపికబురు అందించారు. ఐదు నిమిషాల వరకు ఆలస్యంగా వచ్చిన పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించాలని నిర్ణయించారు.

20,394 మంది గైర్హాజరు

రాష్ట్రంలో ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు శుక్రవారం ఇంగ్లీష్ పేపర్-1 పరీక్షను నిర్వహించామని శృతి ఓజా తెలిపారు. ఈ పరీక్షకు 5,00,936 మంది దరఖాస్తు చేయగా, 4,80,542 (95.93 శాతం) మంది విద్యార్థులు హాజరయ్యారని వివరించారు. 20,394 (4.07 శాతం) మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. కరీంనగర్‌లో ముగ్గురు, నిజామాబాద్‌లో ఒకరు కలిపి నలుగురు విద్యార్థులపై మాల్‌ప్రాక్టీస్ కేసులను నమోదు చేశామని తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఇంగ్లీష్ పరీక్షకు సెట్ బి ప్రశ్నా పత్రాన్ని ఎంపిక చేశామని వివరించారు. ఆదిలాబాద్, రంగారెడ్డి, కామారెడ్డి, వనపర్తి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో ఇంటర్ బోర్డు నుంచి పరిశీలకులు వెళ్లి పరీక్షను పరిశీలించారని పేర్కొన్నారు. ఈ పరీక్ష ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా జరిగిందని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే లాస్య
నందిత డ్రైవర్ ఎక్కడ..?

- అజ్ఞాతంలో ఆకాష్!

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత రోడ్డు ప్రమాదం కేసులో డ్రైవర్ అజ్ఞాతంలోకి వెళ్లి పోయారు. ప్రమాదం సమయంలో ఆమె కారు నడిపిన డ్రైవర్ ఆకాష్ ఆచూకీ తెలియడం లేదు. ప్రస్తుతం అతను అజ్ఞాతంలో ఉన్నట్టు తెలుస్తోంది. రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు తీవ్రంగా గాయపడిన డ్రైవర్ ఆకాష్ హైదరాబాద్ మియాపూర్ మదిన గూడా స్వీకర హాస్పిటల్‌లో చికిత్స పొంది గత ఆదివారమే డిశ్చార్జ్ అయ్యారు. అయితే అప్పటి నుంచి అతను అజ్ఞాతంలోనే ఉన్నాడు. అతను ఎక్కడ ఉన్నాడు అనేది తెలియకపోవడం పలు అనుమానాలకు దారి తీస్తోంది. పరిసర ప్రాంతాలలో ఉంటే తనకు ఎమ్మెల్యే అభిమానుల ద్వారా ఏమైనా ప్రాణాపాయం ఉంటుందన్న కారణంతో ఆకాష్ ఎవరికీ తెలియకుండా దూరంగా ఉంటున్నట్టు సమాచారం. ప్రమాదం జరిగిన వెంటనే ఎమ్మెల్యే లాస్య నందిత సోదరి నివేదిత పటాన్‌చెరు పోలీస్ స్టేషన్‌లో ఆకాష్‌పై కేసు పెట్టిన విషయం తెలిసిందే. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ప్రమాదానికి ముందు ఎమ్మెల్యే కారు ఓ ట్రక్కును ఢీకొట్టిన విషయం విదితమే. సీసీ పుటేజీల ద్వారా ఆ ట్రక్కును గుర్తించిన పోలీసులు.. డ్రైవర్‌ను పట్టుకున్నట్టు తెలిసింది.

ఆకాష్ ఎవరంటే..

లాస్య ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత రెండు నూతన కార్లు కొనుగోలు చేశారు. అయితే ఆ కార్లకు డ్రైవర్ ఉన్న వ్యక్తి తన చిన్ననాటి స్నేహితుడైన ఆకాష్‌ను ఎమ్మెల్యేకు పరిచయం చేశాడు. ఆకాష్ తన స్నేహితుడని, ఖాళీగా ఉంటున్నాడని, కానిస్టేబు ల్ ఉద్యోగంలో చేరే వరకు పిఎగా ఉంటాడని చెప్పాడు. దాంతో ఎమ్మెల్యే లాస్య కుటుంబీకులు ఆకాష్‌ను తొలుత పిఎగా తీసుకున్నారు. ఆ తర్వాత నల్లగొండ జిల్లాలో లాస్య నందిత కారు ప్రమాదానికి గురికావడంతో ఆ డ్రైవర్‌ను విధుల నుంచి తొలగించి ఆకాష్‌ను పిఎ కం డ్రైవర్‌గా పెట్టుకున్నారు. ఆకాష్ కానిస్టేబుల్ పరీక్ష రాసి ఎంపికయ్యాడు. త్వరలో నియామకం కావాల్సి ఉంది.

జెండా పాటకు భిన్నంగా ధర

- ఖమ్మం మార్కెట్లో మిర్చి రైతుల ఆందోళన
- మార్కెట్‌కొచ్చి వ్యాపారులతో మాట్లాడిన అదనపు కలెక్టర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఖమ్మం మిర్చి మార్కెట్లో వ్యాపారులు వ్యవహారంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొద్దిరోజులుగా జెండా పాటకు భిన్నంగా కొనుగోళ్లు జరుపుతున్నారు. జెండాపాటకు అనుగుణంగా ఒకటి, రెండు లాట్లు రేటు పెట్టాక.. మిగిలిన సరుకునంతా నాణ్యత, ఎగుమతులు లేకపోవడం, డిమాండ్‌కు మించి సరుకు రావడం, ఇతరత్ర కారణాలు చూపుతూ క్వింటాకు రూ.నాలుగు వేలకు పైగా తగ్గించి కొనుగోలు చేస్తున్నారు.

జెండాపాటలో నలుగురైదుగురు వ్యాపారులే పాల్గొని ధర నిర్ణయించడం గమనార్హం. దీనిపై రైతులు పలుమార్లు మార్కెట్ అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్తున్నారు. అయినప్పటికీ వ్యాపారులు అదే రీతిన వెళ్తుండటంతో శుక్రవారం మార్కెట్ ప్రధాన గేటు వద్ద ఆందోళన నిర్వహించారు.

మంత్రి, కలెక్టర్ చెప్పినా తీరు మారట్లే..!

వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కొద్దిరోజుల కిందట మార్కెట్‌ను సందర్శించారు. ఆ సమయంలోనూ వ్యాపారులపై రైతులు ఏకరువు పెట్టుకున్నారు. రెండు, మూడ్రోజుల కిందట జిల్లా కలెక్టర్ విపి గౌతమ్ కూడా మార్కెట్‌కు వచ్చారు. ధర విషయంలో వ్యాపారులను హెచ్చరించారు.

జెండా పాటకు భిన్నంగా ధర పెడితే లైసెన్స్‌లు రద్దు చేస్తామన్నారు. అయినా వ్యాపారుల వైఖరిలో ఏమాత్రం మార్పు రాలేదు. శుక్రవారం రైతులు ఆందోళన చేయడంతో అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ మార్కెట్‌ను సందర్శించారు. రైతులతో మాట్లాడారు. గిట్టుబాటు ధర కల్పించాలని, అప్పటి వరకు కొనుగోళ్లు నిలిపివేయాలని, గేట్లు మూసివేయాలని డిమాండ్ చేశారు. రైతుల ఆందోళనతో మార్కెట్లో కొద్దిపాటి ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కొనుగోళ్లు నిలిచిపోయాయి. వ్యాపారులతో అదనపు కలెక్టర్, మార్కెట్‌శాఖ అధికారులు చర్చలు జరిపారు. మిర్చి కొనుగోళ్లు ముమ్మరమైనప్పటి నుంచి జెండా పాటకు విరుద్ధంగా ధర చెల్లిస్తున్నారు. జెండా పాట క్వింటాకు రూ.20,800 ప్రకటించగా.. వ్యాపారులు రూ.16 వేల నుంచి రూ.14 వేల మధ్యనే కొనుగోలు చేయడంతో రైతుల్లో ఆగ్రహం పెల్లుబికింది. ముఖ్యంగా పది వేలకు పైగా బస్తాల సరుకు వచ్చిన సందర్భంలో రేటు తగ్గించి కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. శుక్రవారం 16,215 బస్తాలు మార్కెట్‌కు రాగా, గరిష్ట ధర రూ.20,800, కనిష్టం రూ.14,000, మోడల్ ధర రూ.19,000 నిర్ధారించారు. కానీ అధిక మొత్తం సరుకును సగటున రూ.15 వేలకే కొనుగోలు చేశారని రైతులంటున్నారు. వ్యాపారులతో అదనపు కలెక్టర్ చర్చల అనంతరం ఇక మీదట సరైన ధర చెల్లించేందుకు వ్యాపారులు ఒప్పుకున్నట్టు చెప్పారు. అధికారులు దగ్గరుండి గిట్టుబాటు ధర పెట్టేలా చూడాలని రైతులు విజ్ఞప్తి చేశారు.

మార్కెట్ ఎదుట ఆందోళన చేస్తున్న మిర్చి రైతులు

జెండా పాట రేటు పెట్టాలి : రాందాసునాయక్

ఎన్నో ఏళ్ల నుంచి మిర్చి తోట వేస్తున్నా.. ఈ ఏడాది తెగుళ్లతో సగం తోట చచ్చిపోయింది. మొత్తం రూ.8లక్షల పెట్టుబడి పెడితే 20 బస్తాల దిగుబడి వచ్చింది. మొత్తం సరుకు పది క్వింటాలైనా ఇక్కడున్న రేటు ప్రకారం నాకు వచ్చేది రూ.1.50 లక్షలే. జెండా పాట ఎంత పాడితే అంత ధర మాకు చెల్లిస్తే కొద్దోగొప్పైనా న్యాయం జరుగుతుంది.

రోడ్డు ప్రమాదంలో ఇంటర్ విద్యార్థినికి గాయాలు

- చికిత్స చేయించి పరీక్షా కేంద్రానికి తీసుకెళ్లిన ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇంటర్ పరీక్ష రాసేందుకు వెళ్తుండగా రోడ్డు ప్రమాదంలో గాయపడిన విద్యార్థినికి ఓ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ప్రథమ చికిత్స చేయించి సమయానికి పరీక్ష కేంద్రానికి తీసుకెళ్లారు. వివరాల్లోకెళ్తే.. శుక్రవారం హైదరాబాద్‌లో ఓ విద్యార్థిని ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్ష రాసేందుకు తండ్రితో కలిసి ద్విచక్ర వాహనంపై బయలుదేరింది. సికింద్రాబాద్ ఎంజీ రహదారిలోని తపస్య కళాశాల వద్ద బైక్ అదుపుతప్పి ఇద్దరూ కింద పడిపోయారు. దాంతో విద్యార్థిని తలకు గాయాలయ్యాయి. అక్కడే విధులు నిర్వహిస్తున్న మహంకాళి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఉపాశంకర్ గమనించి వెంటనే తన వాహనంలో ఆమెను ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. అక్కడ ఆమెకు ఏడు కుట్లుపడ్డాయి. అనంతరం పరీక్షా కేంద్రానికి తీసుకెళ్లారు. ప్రిన్సిపల్ అనుమతి తీసుకుని విద్యార్థినిని సమయానికి తిరిగి పరీక్ష కేంద్రంలో వదిలిపెట్టారు.

జడ్‌పి ఆడిటింగ్ సెక్షన్‌లో అగ్ని ప్రమాదం

- దగ్ధమైన ముఖ్యమైన ఫైళ్లు
- ఘటనపై పలు అనుమానాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నల్లగొండ జడ్‌పి ఆడిటింగ్ సెక్షన్‌లో అగ్ని ప్రమాదం జరిగింది. ముఖ్యమైన ఫైళ్లు దగ్ధ మయ్యాయి. ఈ ఘటన పై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. షార్ట్ సర్క్యూట్‌తో జరిగిన అగ్ని ప్రమాదమా.. లేదంటే కుంభకోణాలు బయట పడకుండా అవినీతిపరులు చేసిన కుట్రనా అని పలువురు చర్చించుకుంటున్నారు. వివరాలిలా ఉన్నాయి.. నల్లగొండ పట్టణంలోని పాత జిల్లా పరిషత్ భవనంలో ఆడిటింగ్ సెక్షన్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ముఖ్యమైన రికార్డులతోపాటు ఫర్నీచర్ పూర్తిగా కాలిపోయింది. సిబ్బంది గమనించి ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ ఇంజన్ సిబ్బంది మంటలను అదుపుచేసింది. అప్పటికే రికార్డులు పూర్తిగా కాలిపోయాయి. ఈ విషయంపై ఉన్నతాధికారులు పలు కోణాల్లో దర్యాప్తు చేపడుతున్నారు. గతంలో కూడా నల్లగొండ మున్సిపల్ ఆఫీస్‌లో అక్రమాలు బయట పడకుండా ఫైళ్లను తగలబెట్టారు. విషయాన్ని బయటికి పొక్కకుండా సిబ్బంది ప్రయత్నం చేశారు.

పామ్ ఆయిల్‌తో అనేక ప్రయోజనాలు

ప్రొఫెసర్ మీనా మెహతా వెల్లడి

హైదరాబాద్ : పామాయిల్ వాడకం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని ప్రొఫెసర్ మీనా మహతా పేర్కొన్నారు. పామాయిల్ ఒక వైవిధ్యమైన ప్రకృతి నుండి పొందిన అనుకూలమైన బహుమని పేర్కొన్నారు. ఆహార ఉత్పత్తిలో దాని అసమానమైన సామర్థ్యం నుండి ఆర్థిక వృద్ధి, గ్రామీణ అభివృద్ధికి దోహదం చేస్తుందని ఎస్‌ఎన్‌డిటి వుమెన్స్ యూనివర్శిటీలో ప్రొఫెసర్‌గా ఉన్న మీనా తెలిపారు. ఆహార రంగంలో ప్రత్యేకమైన సమతుల్య కొవ్వు ఆమ్లాల కూర్పు కారణంగా ప్రాసెస్ చేసిన ఆహారాల కోసం అనువైన నూనెగా వనస్పతి నిలుస్తుందన్నారు.

విశ్వనాథ్ సినిమా సందేశాత్మకం

జస్టిస్ లక్ష్మణ్

ప్రజాశక్తి కల్చరల్

సాగర సంగమం స్వయంకృషి స్వర్ణ కమలం వంటి విశ్వనాథ్ సినిమాలు సందేశం అర్థవంతంకు బ్రాండ్‌లు అని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం న్యాయమూర్తి జస్టిస్ కె లక్ష్మణ్ పేర్కొన్నారు. రవీంద్ర భారతిలోని సమావేశ మందిరంలో యువకళావాహిని నిర్వహణలో భాష సాంస్కృతిక శాఖ సౌజన్యంతో విఖ్యాత దర్శకుడు డాక్టర్ కె విశ్వనాథ్ జయంతి సభ జరిగింది. ముఖ్య అతిథిగా జస్టిస్ లక్ష్మణ్ పాల్గొని విశ్వనాథ్ పేరిట ఏర్పాటు చేసిన పురస్కారాలు నటి డబ్బింగ్ కళాకారిణి జానకికి నటుడు హేమ సుందర్‌కు బహుకరించి మాట్లాడారు. విశ్వనాథ్ అవార్డ్స్ లక్ష్యంగా సినిమాలు తీయలదనీ అయన వృత్తి పట్ల అంకిత భావం సమాజం పట్ల నిబద్ధతతో చిత్రాలకు దర్శకత్వం వహించారని అన్నారు. అవార్డ్ గ్రహీత డబ్బింగ్ జానకీ నాలుగు దశాబ్దాలు క్రితమే మతాంతర వివాహం చేసుకోవటం విశేషమని విశ్వనాథ్ ఆమెను తన సినిమాలలో అవకాశాలు ఎక్కువగా ఇచ్చారని చెప్పారు. కళా పోషకుడు సారిపల్లి కొండలరావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ విశ్వనాథ్ సినిమాలు నిత్య నూతనం అన్నారు. పూర్ణోదయ మూవీస్ ఏడిద నాగేశ్వరరావు కుమారుడు రాజా, రచయిత్రి జ్యోతి సినీ జర్నలిస్ట్ ఎస్‌వి రామా రావు విశ్వనాథ్ సినిమాలు గురించి విశ్లేషణ చేశారు. సంస్థ అధ్యక్షులు లంక లక్ష్మి నారాయణ స్వాగతం పలికిన కార్యక్రమం తొలుత త్రినాథరావు లలిత పాటలు మధురంగా ఆలపించారు.

కాంగ్రెస్ గెలిచిన స్థానాల్లో ఎక్కడినుంచైనా పోటీకి సిద్ధం

కెటిఆర్‌కు మంత్రి పొన్నం ప్రభాకర్ సవాల్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్ గెలిచిన స్థానాల్లో ఎక్కడినుంచైనా పోటీకి సిద్ధమని బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌కు సవాల్ విసిరారు. గత నాలుగు రోజులుగా సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు, కెటిఆర్, బిఆర్ఎస్ నేతల మధ్య జరుగుతున్న సవాళ్లు ప్రతి సవాళ్ల నేపథ్యంలో శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయం వద్ద మీడియాతో మాట్లాడుతూ కెటిఆర్‌పై ఘాటైన వ్యాఖ్యాలు చేశారు. ఎంపి పరిధిలో ఉన్న ముగ్గురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు రాజీనామా చేసి పోటీ చేస్తారనీ, దమ్ముంటే కేటీఆర్ బరిలో నిలవాలని సూచించారు. నల్లగొండ నుంచి రాజీనామా చేసి సిరిసిల్ల నుంచి పోటీ చేస్తానని ఇప్పటికే మంత్రి కోమటిరెడ్డి చేసిన వ్యాఖ్యలను గుర్తు చేశారు. బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో జరిగిన అవినీతిపై చర్చ జరుగుతున్న నేపథ్యంలో భవిష్యత్‌లో శిక్ష తప్పదేమోననే భయంతో కెటిఆర్ మాట్లాడుతున్నారని ఆరోపించారు. మేడిగడ్డకు చెందిన 40,50 పిల్లర్లలో రెండు పిల్లర్లు కుంగిపోతే నష్టమేంటని అనడాన్ని పొన్నం తప్పు పట్టారు. జపాన్ ఆపరేటివ్ ఇంటర్నేషనల్ నుంచి అప్పు తీసుకుని ఎందుకు నాణ్యతగా నిర్మించలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన రెండు నెలల్లోనే అమలు చేస్తున్న మహిళలకు ఉచిత బస్సు, ఆరోగ్యశ్రీ, రూ.500లకే గ్యాస్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాలతో ఉనికి కోల్పోతామని భయపడుతున్నారని విమర్శించారు. నీళ్ల వదిలి ప్రాజెక్ట్ కొట్టుకుపోకుండా కాపాడుతున్నామే తప్ప కూల్చే ఉద్దేశం తమకు లేదని స్పష్టం చేశారు. కాళేశ్వరం వైట్ ఎలిఫెంట్ అని గతంలో చెప్పిన మాటలు ఇప్పుడు బుజువు కాబోతున్నాయని పేర్కొన్నారు. కాళేశ్వరంపై డ్యాం సేఫ్టీ అధికారుల సలహా మేరకు ముందుకు వెళ్తామనీ, బాధ్యులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. గతంలో కాంగ్రెస్ నేతలను హౌజ్ అరెస్టులు చేసినట్టు ఇప్పుడు చేయమని చెప్పారు. తమ ప్రభుత్వం ఎవరి పర్యటనలు అడ్డుకోదనీ, కాళేశ్వరం రావాలని బిఆర్ఎస్, బిజెపి నేతలను తామే ఆహ్వానించామని గుర్తు చేశారు.

బాబ్లీ నుంచి ఎస్ఆర్‌సిపికి నీటి విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తాగునీటి అవసరాల మేరకు మహారాష్ట్రలోని బాబ్లీ ప్రాజెక్టు గేట్లు ఎత్తి శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌కు నీటిని విడుదల చేసినట్టు ఎస్ఆర్‌పిపి ఎఇఇ రవి తెలిపారు. బాబ్లీ ప్రాజెక్టు నుంచి సిడబ్ల్యుసి అధికారుల సమక్షంలో మహారాష్ట్ర, తెలంగాణ ప్రాజెక్టుల అధికారులు శుక్రవారం బాబ్లీ గేట్లు తెరిచారు. 0.6 టిఎంసిల నీరు విడుదల చేసి మూసివేయనున్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ప్రతి సంవత్సరం మార్చి 1న దిగువకు 0.6 టీఎంసీల నీటిని తాగునీటి కోసం బాబ్లీ ప్రాజెక్టు నుంచి గోదావరి నది గుండా ఎస్సారెస్పీలోకి వదులుతారు. ఈ కార్యక్రమంలో సిడబ్ల్యుసి ఇఇఇ వెంకటేశ్వర్లు, బాబ్లీ ప్రాజెక్టు ఈఈ సిఆర్ బాన్సోధ్, ఎస్సారెస్పీ డిఈఈ గణేష్, ఎస్ఆర్‌పిసి ఎఇఇ రవి, కడెం ప్రాజెక్టు డిఇఇ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

పదేళ్లుగా పోరాటం..

- తొలగించిన ఉద్యోగం ఇవ్వాలని ఆమరణ దీక్ష
- ఎనిమిది కేసులు పెట్టిన పోలీస్ శాఖ
- మాజీ మహిళా హోమ్‌గార్డు ఆవేదన

ప్రజాశక్తి - హైదరాబాద్

అధికారుల స్వార్థం, అవసరాలకు బలై ఉద్యోగం కోల్పోయిన ఓ మహిళా హోంగార్డు తన ఉద్యోగం తిరిగి ఇప్పించాలని పదేండ్లుగా పోరాడుతోంది. 2009లో గోదావరిఖనికి చెందిన మామిడి పద్మ హోమ్‌గార్డ్‌గా ఎంపికైంది. ఆమెకు మొదట వేములవాడ దేవస్థానంలో విధులు కేటాయించారు. కొంతకాలం అక్కడ విధులు నిర్వర్తించిన అనంతరం ఆమెను గోదావరిఖనికి బదిలీ చేశారు. ఇక్కడ ఎఎస్‌పి విష్ణు వారియర్ ఇంట్లో ఆమెకు విధులు కేటాయించారు. ఈ క్రమంలో ఓ రోజు విష్ణు వారియర్ ఇంట్లో తన విధులకు సంబంధం లేని పనిని అప్పగించడంపై హోంగార్డు పద్మ తన వ్యతిరేకతను బహిర్గతం చేశారు. దీంతో ఆమెకు ట్రాఫిక్ విభాగంలో విధులు కేటాయించారు. ఈ విధులకు ఆమె యూనిఫార్మ్ చుడీదార్ ధరించడాన్ని కారణంగా చూపి కక్షపూరితంగా తనను 2014లో ఉద్యోగం నుంచి తొలగించిన్నట్టు బాధితురాలు పద్మ వాపోతోంది. ఉద్యోగం నుంచి తొలగించడంతో 2014నుంచి పద్మ ఆర్థికంగా అనేక ఇబ్బందులను ఎదుర్కొంటోంది. పిల్లల పోషణకూ భారమై మానసికంగా, ఆర్థికంగా కష్టాలు పడుతోంది. తన ఉద్యోగం తిరిగి ఇప్పించాలని అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, మంత్రులను వేడుకుంటోంది. అందరికీ వినతిపత్రాలు సైతం ఇచ్చింది. ప్రజాపాలనలో తనకు న్యాయం జరుగుతుందని ఆశించిన పద్మ దీక్షకు పూనుకుంది. ఫిబ్రవరి 17న నిరసనకు దిగి 19న అనారోగ్యానికి గురి కావడంతో పోలీసులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కొంచెం ఆరోగ్యం కోలుకోవడంతో ఫిబ్రవరి 29న తిరిగి ఆమరణ దీక్ష ప్రారంభించింది. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నిష్పక్షపాతంగా విచారణ జరిపించి తనకు న్యాయం చేయాలని పద్మ కోరుకుంటోంది.

వర్క్ ఫ్రమ్ హోం, పార్ట్‌టైం జాబ్స్‌తో గాలం

- ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో మోసాలు
- ముగ్గురు సైబర్ నిందితుల అరెస్ట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న డిసిపి డి కవిత

వర్క్ ఫ్రమ్ హోం, పార్ట్‌టైం పేరుతో మోసాలకు పాల్పడుతున్న ముగ్గురు సైబర్ నిందితులను వేర్వేరు కేసుల్లో హైదరాబాద్ సిసిఎస్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి చెక్‌బుక్స్, క్రెడిట్, డెబిట్ కార్డ్సు, వివిధ బ్యాంక్‌లకు చెందిన చెక్‌బుక్స్, సిమ్‌కార్డులు, ల్యాప్‌టాప్స్‌తో పాటు రూ.ఐదు లక్షలు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం బషీర్‌బాగ్‌లోని సిసిఎస్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో డిసిపి డి కవిత వివరాలు వెల్లడించారు. గుజరాత్‌కు చెందిన అబ్దుల్లా ఫరూక్ జుంజున్యా, ముంబయికి చెందిన మహమ్మద్ సోహ్యాబ్ బబ్లూఖాన్ ఒక గ్రూపుగా ఏర్పడ్డారు. ప్రముఖ కంపెనీల్లో పార్ట్‌టైమ్, వర్క్ ఫ్రం హెూం ఉద్యోగాలిపిస్తామని పలువురికి గాలం వేస్తున్నారు. పోలీసులకు చిక్కకుండా కమీషన్లపై బ్యాంక్ ఖాతాలు సేకరిస్తున్నారు. ఉద్యోగం కోసం ఎవరైనా స్పందిస్తే నమ్మకం కుదిరేందుకు బోనస్‌గా రూ.500 పంపిస్తున్నారు. ఆ తర్వాత ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో అందిన కాడికి దండుకుంటున్నారు. ఇదే తరహాలో హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తిని టార్గెట్ చేసిన సైబర్ నిందితులు వాట్సాప్, టెలిగ్రామ్ ద్వారా మెసేజ్ పెట్టారు. కొద్దిరోజులు చాటింగ్ చేశారు. నమ్మకం కుదిరేందుకు రూ.500ను బాధితునికి పంపించారు. దాంతో వారిని పూర్తిగా నమ్మిన బాధితుడు వారు చెప్పిన విధంగా చేశాడు. దాంతో సైబర్ నిందితులు ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో రూ.2,38,405 కొట్టేశారు. తీరా మోసపోయినట్టు గుర్తించిన బాధితుడు సిపిఎస్‌లో ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. దేశవ్యాప్తంగా మోసాలకు పాల్పడిన నిందితులపై 42 కేసులున్నాయని, దాదాపు రూ.4.5 కోట్లను కొట్టేశారని తెలిపారు. నిందితులపై తెలంగాణలో ఆరు కేసులు నమోదుకాగా, హైదరాబాద్‌లో మూడు కేసులు, రాచకొండలో ఒక కేసు, సైబరాబాద్ కమిషనరేట్‌లో రెండు కేసులున్నాయని డిసిపి తెలిపారు. దేశవ్యాప్తంగా మోసాలకు పాల్పడుతున్న నిందితులపై ఫిర్యాదు రావడంతో సిసిఎస్ పోలీసులు ప్రత్యేక నిఘా వేశారు. ఈ సమావేశంలో ఏసీపీ శివమారుతీ, ఇన్‌స్పెక్టర్ నరేష్, ఎస్ఐ శైలేందర్ తదితరులు ఉన్నారు.

మల్టీనేషనల్ కంపెనీలో ఉద్యోగాలు

మల్టీనేషనల్ కంపెనీల్లో (ఎంఎన్‌సి)లో ఉద్యోగాలిప్పిస్తామని మోసం చేసిన మరో నిందితుడినీ సిసిఎస్ పోలీసులు అరెస్టు చేశారు. బాచుపల్లికి చెందిన కె.సీతయ్య ఆన్‌లైన్ గేమింగ్‌లో నష్టపోయాడు. ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో మోసాలపై దృష్టిసారించాడు.

ఎరిక్సన్ గ్లోబల్ ఇండియా ప్రయివేటు లిమిటెడ్ కంపెనీలో బిజినెస్ ఇంటెలిజెన్స్ అనలిస్ట్ ఉద్యోగాలున్నాయని పలువురిని నమ్మించాడు. ఇదే తరహాలో నగరానికి చెందిన పవన్‌కుమార్ నుంచి రూ.2.50లక్షలు దండుకున్నాడు. అతన్ని నమ్మించేందుకు నకిలీ జాబ్ ఆఫర్ లెటర్ పంపించాడు. అయితే తీరా మోసపోయినట్టు గుర్తించిన బాధితుడు సిసిఎస్‌లో ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన పోలీసులు.. నిందితుడిని అరెస్టు చేశారు. ఉద్యోగాల పేరుతో మోసాలు చేస్తున్న నిందితుడిపై ఆరు కేసులు నమోదైనట్టు డిసిపి తెలిపారు.

104 ఉద్యోగుల ధర్నా

- ఐదు నెలలుగా పెండింగ్‌లో వేతనాలు
- అప్పుల పాలవుతున్నాం.. ఆదుకోండి..
- ధర్నాలో '104 సిబ్బంది ఆవేదన
- స్పందించకపోతే ఉద్యమమే
- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

'గత ప్రభుత్వ వైఫల్యాలు సరే..మా కడుపు నిండేదెట్లా? అని 104 ఉద్యోగులు ప్రశ్నిస్తున్నారు. ఐదు నెల్ల నుంచి చేసిన పనికి జీతాలు ఇవ్వటం లేదు. మా కుటుంబాలను సాకేదెట్లా? ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలు జీతాలు తీసుకుంటున్నారు కదా? మరి మా జీతాలనే ఎందుకు పెండింగ్‌లో పెట్టారు? మా పట్ల ఎందుకింత వివక్ష? మా పట్ల వివక్షను ప్రదర్శిస్తున్న మీరు ఆరోగ్య రాష్ట్రంగా ఎలా తీర్చిదిద్దుతారు?' అంటూ సర్కారుపై 104 ఉద్యోగులు ప్రశ్నల వర్షం కురిపించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ధర్నా చౌక్‌లో తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో 104 ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. రాష్ట్ర నలుమూలలనుంచి వచ్చిన ఉద్యోగులు తమ ఆవేదనను నినాదాల రూపంలో ప్రభుత్వానికి వినిపించారు. కొత్త ప్రభుత్వమైనా తమ బాధలు పట్టించుకోవాలని మొరపెట్టుకున్నారు.

ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల పట్ల నిర్లక్ష్యాన్ని ప్రదర్శించిందని విమర్శించారు. మాటలతో కాలం వెళ్లదీసిందని చెప్పారు. ఆ ప్రభుత్వ నియంతృత్వ పోకడలకు కార్మిక వర్గం తగిన బుద్ధి చెప్పిందని గుర్తు చేశారు. గత ప్రభుత్వ వైఫల్యాలను, ఆర్థిక లోటు పాట్లను వివరించటంతోనే ప్రస్తుత సర్కారు కాలం గడుపుతున్నదనీ, ఐదు నెల్లుగా 104 ఉద్యోగులకు జీతాలు ఇవ్వక పోతే ఎలా బతుకుతారో ప్రభుత్వ పెద్దలు చెప్పాలని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే..వైద్య, ఆరోగ్య రంగంలో పని చేస్తున్న ఉద్యోగులను తక్షణమే పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ వేతనాలన్నీ ఒకే సారి విడుదల చేయాలన్నారు. ఎన్నికల ప్రణాళికలో ప్రకటించిన విధంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ముందుకు సాగాలని కోరారు. ఆ వాగ్దానాలను విస్మరిస్తే..పోరాటాలు తప్పవని హెచ్చరించారు. ఆర్థిక పరిస్థితి బాగో లేదని సన్నాయి నొక్కులు నొక్కొద్దనీ, ఖాళీ ఖజానా చూపి వెనక్కి తగ్గితే కుదరదన్నారు.

తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు భూపాల్ మాట్లాడుతూ ప్రభుత్వ అజమాయిషీలో పని చేస్తున్న ఉద్యోగులకు ఏజన్సీల నుంచి వేతనాలు ఇప్పించటమేంటని ప్రశ్నించారు. ఆ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ఏదో ఒక రోజు పర్మినెంట్ కాకపోతుందా? అనే ఆశతో వివిధ రకాల సేవలందిస్తున్న 104 ఉద్యోగుల పట్ల ప్రభుత్వం వివక్ష చూపుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. అన్ని రకాల ఉద్యోగులకు నెల ప్రారంభంలో వేతనాలు పడుతుంటే..104 ఉద్యోగులకు మాత్రం ఎందుకు వేయటం లేదన్నారు.

సామాజిక బాధ్యతలో ఉన్న వీరి పట్ల నిర్లక్ష్యం తగదన్నారు. 104 సేవలను గత ప్రభుత్వం రద్దు చేసిందనీ, అది విఫల పథకమంటూ ఆ ప్రభుత్వానికి ఎవరు రిపోర్టు ఇచ్చారో తెలియదని వాపోయారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆ నివేదికను బయట పెట్టాలన్నారు. వైఎస్ఆర్ ప్రారంభించిన 104 ఉద్యోగ వ్యవస్థను మరింత సమర్థవంతంగా ముందుకు తీసుకుపోవాలని సూచించారు. గత ఏడాది అక్టోబర్ నుంచి పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్యదర్శులు ఫిసియుద్దీన్,యాదానాయక్, ఉపాధ్యక్షులు బలరాం, విద్యాసాగర్, వి విజయవర్ధన్ రాజు, నవీన్, సుభాష్ చంద్ర, శ్రీనివాస్, మన్మదరావు, రాజేశ్, రాజు తదితరులు మాట్లాడారు.

ముగ్గురు కార్మికుల ఆత్మహత్యాయత్నం

- నల్లగొండ జిల్లా ఆస్పత్రిలో ఘటన
- కాంట్రాక్ట్ ఏజెన్సీని తొలగించాలని సిబ్బంది డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నల్లగొండ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి అవినీతి, అక్రమాల విషయంతో నిత్యం వార్తల్లో నిలుస్తోంది. కొద్దిరోజుల కిందట జిజిహెచ్ సూపరింటెండెంట్ లచ్చు నాయక్ ఓ కాంట్రాక్టర్ నుంచి మూడు లక్షల రూపాయలు లంచం తీసుకుంటూ ఎసిబికి పట్టుబడిన వార్త రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. తాజాగా శుక్రవారం నల్లగొండ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ముగ్గురు అవుట్‌సోర్సింగ్ కార్మికులు ఆత్మహత్యాయత్నం చేసుకోవడం తీవ్ర కలకలం రేపింది.

వివరాల్లోకి వెళితే.. నల్లగొండ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో సాయి సెక్యూరిటీ అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీ కింద కార్మికులు పని చేస్తున్నారు. కొన్నేళ్ల నుంచి నల్లగొండ పట్టణానికి చెందిన వల్కి లలిత, మారం నాగమణి శానిటేషన్ వర్కర్లుగా, బోడ జానకి పేషంట్ కేర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. వీరంతా యూనియన్ తరపున.. ఇటీవల ఆస్పత్రికి వచ్చిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసి తమ సమస్యలపై చెప్పారు. జీతాలు సమయానికి ఇవ్వడంలేదని, వచ్చే తక్కువ జీతంలోనూ కోతలు విధిస్తున్నారని, సెలవులు ఇవ్వడంలేదని వాపోయారు. స్పందించిన మంత్రి.. నిబంధనల మేరకు సిబ్బందికి వేతనాలు చెల్లించాలని ఆదేశాలు జారీ చేశారు. మంత్రికి చెప్పారన్న కక్షతో ఏజెన్సీ నిర్వాహకులు ఆ కార్మికులను విధుల నుంచి తొలగించారు. రెండు నెలలుగా సిబ్బంది ఎవరికీ వేతనాలు ఇవ్వని ఏజెన్సీ.. ఈ ముగ్గురికి మాత్రం 29వ తేదీన జీతాలు వేసి.. అనంతరం విధుల నుంచి తొలగించింది. అయినా వారు రోజువారి విధుల్లో భాగంగా శుక్రవారం ఉదయమే డ్యూటీకి వచ్చారు. అయితే, హాజరు రిజిస్టర్‌లో వారి పేర్లు లేకపోవడంతో ఆందోళనకు గురయ్యారు. విషయాన్ని యూనియన్ సభ్యులతో చెప్పగా.. వారంతా కలిసి క్యాజువాలిటీ ఎదుట ధర్నాకు దిగారు. గంటకుపైగా ధర్నా చేసినా ఎవరూ స్పందించకపోవడంతో ముగ్గురు కార్మికులు సిట్రిజన్ మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం చేశారు. తోటి కార్మికులు వెంటనే వారిని అదే ఆస్పత్రిలో అడ్మిట్ చేశారు. ప్రస్తుతం సూపరింటెండెంట్ పర్యవేక్షణలో వారికి చికిత్స చేస్తున్నారు. ఏడాది కిందట ఓ ఉద్యోగిని విధుల నుంచి తొలగించారని, అతన్ని విధుల్లోకి తీసుకోవాలని మంత్రి ద్వారా ఒత్తిడి తేవడం కూడా ఈ ముగ్గురిని తొలగించడానికి ప్రధాన కారణంగా ఆస్పత్రి సిబ్బంది చర్చించుకుంటున్నారు.

మంత్రి ఆదేశాలు పక్కన పెట్టి

ఆస్పత్రిలో పనిచేసే సిబ్బందికి ప్రభుత్వ నిబంధ నల ప్రకారం వేతనాలు చెల్లించాలని మంత్రి కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి సూపరింటెండెంట్‌కు, ఏజెన్సీ నిర్వా హకులకు ఇటీవల ఆదేశాలు జారీ చేశారు. అయినా ఏజెన్సీ నిర్వాహకులు తమకేమీ పట్టనట్టు ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారు. వాస్తవానికి సిబ్బంది ఒక్కరికి మొత్తం జీతం 15,600 రూపాయలు. అందులో రూ.12093 సిబ్బంది ఖాతాలో జమ చేయాల్సి ఉంటుంది. రూ.3023 పిఎఫ్, 484కు పైగా ఈఎస్ఐ కట్టాల్సి ఉంది. కానీ సదరు ఏజెన్సీ నిర్వాహకులు నెలకు రూ.11,000 మాత్రమే జీతంగా ఇస్తున్నారు. సుమారు రూ.1000 మాత్రమే పిఎఫ్ కడుతున్నారని సిబ్బంది ఆరోపిస్తున్నారు. మొబైల్‌కు ఎప్పుడూ మెసేజ్ రాలేదని, ఈ మధ్యనే మెసేజ్ వస్తుండటంతో అసలు ఎంత మొత్తం చెల్లిస్తున్నారో వెల్లడైందని చెబుతున్నారు.

ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న సిబ్బంది

ఏజెన్సీని వెంటనే తొలగించాలి
మునగ వెంకన్న (యూనియన్ నాయకులు)

అవినీతి అక్రమాలకు పాల్పడుతూ సిబ్బందిని ఇబ్బందులకు గురి చేస్తున్న ఏజెన్సీని వెంటనే తొలగించాలి. జిఒ ప్రకారం వేతనాలను సరైన సమయంలో అందించాలి. సిఎల్స్ ఇవ్వడం లేదు. మాకు సెలవులు ఇవ్వాలి. డ్యూటీ డ్రెస్ ఇవ్వటం లేదు. వాటిని వెంటనే ఇప్పించాలి.

కలెక్టర్ దృష్టికి విషయం
డాక్టర్ నిత్యానంద్ - సూపరింటెండెంట్

మొదటగా ఏజెన్సీ నిర్వాహకులు వెంకన్న నాకు కాల్ చేసి సిబ్బంది ధర్నా చేస్తున్నట్టు చెప్పారు. ఏమైనా ఉంటే మాట్లాడదాం.. మొదట డ్యూటీలోకి వెళ్లాలని చెప్పాలని నేను చెప్పాను. ఉదయం 9:15 గంటలక సమయంలో ముగ్గురు సిబ్బంది సిట్రీజన్ టాబ్లెట్స్ మింగేశారు. అక్కడే ఉన్న డాక్టర్ చికిత్స అందించారు. వారి ఆరోగ్యం ప్రస్తుతం బాగానే ఉంది. మిగతా సిబ్బందికి ఎమర్జెన్సీ సర్వీసులు ఆపొద్దని.. సమస్యలు ఏమైనా ఉంటే పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని చెప్పాను. విషయాన్ని జిల్లా కలెక్టర్‌కు తెలియజేశాను.